నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I | హైదరాబాద్, శనివారం 3 ఆగస్టు 2024 | SANGAREDDY

సంగారెడ్డి జిల్లా కేంద్ర దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు

శుక్రవారం మెదక్-నర్సాపూర్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

పల్లె, పట్నం సుస్తీ..!

- ఉమ్మడి మెదక్ జిల్లాలో పెరుగుతున్న డెంగీ కేసులు
- విజృంభిస్తున్న టైఫాయిడ్, మలేరియా కేసులు
- సీజనల్ వ్యాధుల విజృంభణ.. కిటకిటలాడుతున్న దవాఖానలు
- మెదక్ జిల్లాలో ఇటీవల డెంగీతో యువకుడు మృతి
- సంగారెడ్డిలో జిల్లాలో 70 డెంగీ, 1415 టైఫాయిడ్ కేసులు
- మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ భారీగా కేసులు నమోదు
- ఇంటింటి జ్వర సర్వే చేపడుతున్న వైద్య శాఖ
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో వైద్యం పొందుతున్న రోగులు

మెదక్/సిద్దిపేట/సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 1: ఉమ్మడి మెదక్ జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వర పీడితులతో దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. ఓపీ కేసులతో పాటు ఔట్ పేషెంట్ కేసులు బాగా నమోదవుతున్నాయి. పల్లె, పట్టణం అని తేడా లేకుండా ప్రజలు వైరల్ ఫీవర్ బారిన పడుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా కేసులు బెంబేలెత్తిస్తున్నాయి. తాగునీరు కలుషితం కావడం, దోమలు వృద్ధి చెందడం, పారిశుధ్యం పడకేయడం, తదితర వాటితో జనం జబ్బుల బారినపడుతున్నారు.

సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి జిల్లాలో అధికారికంగా 70 డెంగీ కేసులు నమోదు కాగా, అధికారుల దృష్టికి రాని ఈ కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. టైఫాయిడ్ కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. సంగారెడ్డి జిల్లా లో 1415 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షాలు తక్కువగానే కురిసినప్పటికీ పారిశుధ్యం పడకేయడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో జ్వరం కేసులు పెరుగుతున్నాయి. గత ప్రభుత్వంలో వైద్య ఆరోగ్యశాఖ క్రియాశీలకంగా వ్యవహరించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో డెంగీ, టైఫాయిడ్, మలేరి యా వంటి కేసులు పెద్దగా నమోదు కాలేదు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ సక్రమంగా చేపట్టక పోవడం, మున్సిపాలిటీల్లో రోడ్లపైనే చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమల బెడద పెరిగిందని ప్రజలు వాపోతున్నారు. జ్వరం వస్తే భయంతో దవాఖానలకు పరుగులు తీస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్ర దవాఖానకు రోగుల సంఖ్య బాగా పెరిగింది. ఓ వైపు జ్వరాలతో దవాఖానలో చేరితే మరోవైపు ఔట్ పేషెంట్ విభాగం లోనూ రోగుల సంఖ్య ఎక్కువైంది. ఇటీవల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి వైద్యఆరోగ్య శాఖ అధికారులతో సీజనల్ వ్యాధులపై సమీక్ష నిర్వహించి జిల్లాలో డెంగీ కేసుల పెరుగుదలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై సీజనల్ వ్యాధులు నమోదైతే సంబంధిత అధికారులదే బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని అధికారులను ఆమె ఆదేశించారు.

సంగారెడ్డి జిల్లా కేంద్ర దవాఖానలో ఔట్ పేషెంట్ విభాగంలో రోగులు

మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాల్లో గ్రామాలకు గ్రామాలే వైరల్ ఫీవర్ బారిన పడుతున్నాయి. డెంగీ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇటీవల చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన నిఖిల్ అనే యువకుడు డెంగీతో మృతిచెందాడు. రామాయంపేట మండలం సుతార్‌పల్లిలో చికున్ గున్యాతో అనేక మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ 160 మందికి రక్త పరీక్షలు చేయగా, అందులో ఒకరికి డెంగీ, ముగ్గురికి టైఫాయిడ్ ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది. జిల్లాలో ఇప్పటి వరకు వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం 8 డెంగీ, 12 టైఫాయిడ్ కేసులు, 654 వైరల్ ఫీవర్ కేసులు నమోదయ్యాయి. ఇవేకాక మరో 8 వరకు డెంగీ కేసులు ప్రైవేట్ దవాఖానల్లో నమోదైనట్టు తెలిసింది. పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా కేసులతో దవాఖానలు కిటకిటలాడుతున్నాయి. జలుబు, దగ్గు, జ్వరం తదితర లక్షణాలతో జిల్లాలోని దవాఖానల్లో ఓపీ కేసుల సంఖ్య పెరిగింది. మెదక్ ప్రభుత్వ దవాఖాన సీజనల్ వ్యాధుల చికిత్స కోసం వస్తున్న వారే ఎక్కువ ఉన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, ప్రైవేటు దవాఖానల్లో కూడా ఓపీ సంఖ్య పెరుగుతోంది.మెదక్ జిల్లాకేంద్ర దవాఖానలో నిత్యం 500 మందికి ఓపీ వచ్చే వారు. ఇప్పుడు దాదాపు 600 వరకు పెరిగిందని దవాఖాన వర్గాలు తెలిపాయి.

మెదక్‌లోని జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

మెదక్ జిల్లా దవాఖానలో ఓపీ వద్ద క్యూలో రోగులు

సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో జనవరి నుంచి జూలై నెలాఖరు వరకు 25 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఒక మలేరియా కేసు నమోదైంది. డెంగీ బారినపడి వివిధ దవాఖానల్లో రోగులు చికిత్స పొందుతున్నారు. దోమకాటు కారణంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. సిద్దిపేటలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో జూలై నెలలోనే 31,60 ఔట్ పేషెంట్ రికార్డు నమోదైంది. 2306 మంది ఇన్‌పేషెంట్లుగా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. విష జ్వరాలతో 59 మంది , డెంగీతో ముగ్గురు చికిత్స పొందుతున్నారు. జిల్లాలో 137 మంది జ్వరంతో, 17 మంది డయేరియాతో, 12 మంది దగ్గు, జలుబుతో బాధపడుతున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

పరిసరాల పరిశుభ్రతో డెంగీ నివారణ..

డెంగీ జ్వరాన్ని దరి చేయనీయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వారం దాటి నీరు నిల్వ ఉన్నచోట లార్వా అభివృద్ధి చెందడంతోనే డెంగీ జ్వరానికి కారణమయ్యే ఈడీస్ దోమ వ్యాప్తి చెందుతుందని, ఈడీస్ దోమ పగటిపూట కుట్టడం ద్వారా డెంగీ వచ్చిన వారితో ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందుతున్నదని తెలిపారు. ఇంట్లోని రిఫ్రిజిరేటర్ల బ్యాక్ వాటర్, కుళాయిలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. వాడి పడేసిన టైర్లు, కొబ్బరి చిప్పల వాటిలో నీరు నిల్వ ఉంటే వాటిని తొలిగించాలి. ఎలాంటి పాత్రలో అయినా వారం రోజులు మించి నీరు నిల్వ ఉంటే అక్కడ లార్వా అభివృద్ధి చెందకుండా కిరోసిన్ చుక్కలు వేయాలని వైద్య ఆరోగ్యశాఖ సూచిస్తున్నది. ప్రజలు శుభ్రమైన నీటినే తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. చాలా గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. కొన్ని గ్రామాల్లో పైప్‌లు పగిలిపోయి తాగునీరు కలుషితమై డయేరియా ప్రబలుతోంది. పల్లెల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ సరిగ్గా చేయడం లేదు. పర్యవేక్షణ చేయాల్సిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నా దోమల నివారణ కోసం బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ వంటివి చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రత్యేకాధికారుల పాలన, నిధుల లేమితో పంచాయతీల్లో పాలన పడకేసింది.

జిల్లాలో నియంత్రణలో సీజనల్ వ్యాధులు

జిల్లాలో సీజనల్ వ్యాధులు నియంత్రణలోనే ఉన్నాయి. బుధవారం జిల్లాలో 67 డెంగీ కేసులు ఉండగా, గురువారానికి మరో 3 కేసులు పెరిగి 70 కేసులు నమోదయ్యాయి. ఇందులో 22 కేసులు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నాయి. టైఫాయిడ్ కేసులు 1415 ఉండగా, చికెన్ గున్యా, మలేరియా జ్వరానికి సంబంధించిన కేసులు జిల్లాలో నమోదు కాలేదు. జిల్లాలో అంటువ్యాధులను అరికట్టేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు జూలై 8 నుంచి ఇంటింటికీ వెళ్లి జ్వరం సర్వే నిర్వహిస్తున్నాం. డ్రై డే పాటిస్తున్నాం. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదు.ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నివారణ కోసం జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నది.

- డాక్టర్ గాయత్రీదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సంగారెడ్డి

పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న

పది రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న. ఊరిలో ఆర్ఎంపీ దగ్గర చికిత్స తీసుకున్నా. కానీ, తగ్గ లేదు. మూడు రోజు ల క్రితం సిద్దిపేట జనరల్ దవాఖానకు వచ్చి చూపించుకుంటే అడ్మిట్ కావాలని చెప్పారు. రెండు రోజుల నుంచి సెలైన్ పెడుతున్నారు. మందులు ఇస్తున్నారు. ఇంకా పూర్తిగా జ్వరం తగ్గలేదు.

-సాయికిరణ్, ఖాజీపూర్(సిద్దిపేట జిల్లా)

రక్తకణాలు తగ్గాయని చెప్పారు..

పది రోజుల నుంచి విపరీతంగా జ్వరం వస్తున్నది. గ్రామం లో ఆర్ ఎంపీ దగ్గర చూపించుకున్నా. జ్వరం తక్కువ కాలేదు. దుబ్బాకలో ప్రైవేట్ దవాఖానలో టెస్టులు చేయించుకున్నా. రక్తకణాలు తగ్గాయని చెప్పారు. మంచి వైద్యం కోసం ఇక్కడికి రెఫర్ చేశారు. నాలుగు రోజులు అవుతుంది వచ్చి. సిద్దిపేట దవాఖానలో చికిత్స పొందుతున్న. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న.

- స్రవంతి, చెల్లాపూర్ (సిద్దిపేట జిల్లా)

రెండు వారాలుగా జ్వరం..

15 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్న. కోహెడలో డాక్టర్లకు చూపించుకున్న. కానీ, తక్కువ కాలేదు. ఏఎన్ఎం, వైద్య సిబ్బంది మా ఇంటికి వచ్చి గోలీలు ఇచ్చిండ్రు. అయినా తక్కువ కాలేదు, సిద్దిపేట ప్రభుత్వ దవాఖానలో మూడు రోజుల క్రితం వచ్చి చూపించుకున్న. టెస్ట్‌లు చేసి టైఫాయిడ్ అని వైద్యులు చెప్పారు. రెండు రోజుల నుంచి గ్లూకోజ్‌లు పెట్టారు.

- చిలుకవ్వ, తంగెళ్లపల్లి, కోహెడ మండలం(సిద్దిపేట జిల్లా)

ఏసీబీ గుబులు

- కందిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 12 గంటల పాటు సాగిన సోదాలు
- ఉ. 6గంటల తర్వాత వెళ్లిన అధికారులు
- విచారణ కోసం 56 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను తీసుకెళ్లిన ఏసీబీ అధికారులు
- తనిఖీలకు భయపడి విధులకు హాజరు కాని ఉద్యోగులు
- వెలవెలబోయిన కార్యాలయ ప్రాంగణం

కందిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

కంది, ఆగస్టు 2: సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు జరిపిన ఆకస్మిక సోదాలతో అధికారులు, ఉద్యోగులకు గుబులు పుట్టించింది. గురువారం సాయంత్రం 6గంటల రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న ఏసీబీ అధికారులు శుక్రవారం ఉదయం 6గంటల వరకు సోదాలు చేపట్టారు. జరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పరిశీలించడంతో పాటు అనుమానంతో ఉన్న పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల రాకతో రూ. లక్ష నగదును కిటికీలోంచి బయట పడేశారు. ఈ నగదును బయట పారేసింది ఎవరు అన్న కోణంలో పూర్తి విచారణ చేపట్టినట్లు సమాచారం. గురువారం జరిగిన భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన 56 డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు తమ వెంట తీసుకెళ్లారు. సోదాలకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని ఏసీబీ అధికారులు మీడియాకు తెలియ పర్చలేదు.

విధులకు హాజరుకాని ఉద్యోగులు

ఏసీబీ అధికారుల తనిఖీలకు భయపడి ఉద్యోగులు విధులకు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల వరకూ కందిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉన్న ఏ ఒక్క కౌంటర్ తెరుచుకోలేదు. రిజిస్ట్రేషన్లు జరగవనే ప్రచారం జరిగింది. ఈ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లే కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్యాకుమెంట్‌ను బట్టి బేరసారాలు నడుస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు డాక్యుమెంట్ రైటర్లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తున్నది. నిత్యం రిజిస్ట్రేషన్‌దారులతో హడావిడిగా ఉండే డాక్యుమెంట్ రైటర్ల షాపులు కూడా మూసిఉండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఏసీబీ అధికారుల సోదాలతో శుక్రవారం కార్యాలయం జనం లేక వెలవెలబోయింది. సెంటిమెంట్ దినం కావడంతో ప్రతి శుక్రవారం రిజిస్ట్రేన్లతో కార్యాలయం కిక్కిరిసిపోయేది. కానీ, ఈ శుక్రవారం భూ వ్యాపారులు, రిజిస్ట్రేషన్‌దారులు లేక కార్యాలయం, కార్యాలయ ఆవరణ బోసిపోయింది.

తెరుచుకోని డాక్యుమెంట్ రైటర్ల షాపులు

భూమి పోతుందనే బెంగతో రైతు మృతి

రైతు వంటేల రామ్‌రెడ్డి (ఫైల్)

నర్సాపూర్, ఆగస్టు 2 : కొండపోచమ్మ కాలువ నిర్మాణంలో తన భూమి పోతుందన్న బెంగతో ఓరైతు గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంటలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. చిన్నచింతకుంట గ్రామానికి చెందిన రైతు వంటేల రామ్‌రెడ్డి(58)కి సర్వేనెంబర్ 183/అ3/1లో రెండెకరాల పొలం ఉంది. ఉన్న పొలం కాస్త కొండపోచమ్మ కాల్వ నిర్మాణంలో పోతుందని, కాల్వ నిర్మాణం చేపట్టవద్దని 22 రోజులుగా నర్సాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నాడు. తన భూమి కాలువలో పోతుందని కొద్దిరోజులుగా తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. శుక్రవారం ఉదయం 3 గంటలకు తన ఇంట్లో గుండెపోటుకు గురై మృతిచెందాడు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

గుండెపోటుతో అకాల మరణం పొందిన రైతు వంటేల రామ్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కొండపోచమ్మ కాలువ భూనిర్వాసితులు చిన్నచింతకుంట గ్రామ సమీపంలోని నర్సాపూర్-మెదక్ జాతీయ రహదారిపై శుక్రవారం రాస్తారోకో చేశారు. ఏఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డితో మాట్లాడించారు. బాధిత రైతు కుటుంబానికి ప్రభుత్వ పరంగా న్యాయం జరిగేలా చూస్తానని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. రాస్తారోకోలో రైతులు మహేశ్, రామకృష్ణ, అంజాగౌడ్, నారాయణ, శ్రీనివాస్, శ్రీశైలం యాదవ్, పెంటయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో సౌకర్యాలు కల్పించాలి

సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి

రైతు బజార్‌ను సందర్శించిన కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట, ఆగస్టు 2: సిద్దిపేట పట్టణంలోని రైతు బజార్‌లో రైతులకు, కొనుగోలుదారులకు ఎలాంటి ఆసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని రైతు బజార్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రైతుల కోసం కల్పించిన వసతులను పరిశీలించారు. వివిధ మండలాల నుంచి 350 నుంచి 400మంది రైతులు నిత్యం వచ్చి ఇక్కడ కూరగాయలు ఆమ్ముతారని, నలుగురు వాచ్‌మెన్లు, నలుగురు శానిటేషన్ సిబ్బంది, ఒక ఎస్టేట్ అధికారి పనిచేస్తున్నారని మార్కెటింగ్ అధికారి నాగరాజు కలెక్టర్‌కు తెలిపారు. తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు కల్పించాలని, ధరల పట్టికలో సూచించిన విధంగా కూరగాయలు విక్రయించాలన్నారు. అనంతరం సిద్దిపేట పట్టణంలోని సెట్విన్ సాంకేతిక శిక్షణ సంస్థను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కోర్సుల శిక్షణ గురించి తెలుసుకున్నారు. బ్యాచ్‌ల వారీగా 150 నుంచి 200 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు సెట్విన్ జిల్లా కోఆర్డినేటర్ అమీనా తెలిపారు. శిక్షణ ఇచ్చి ఉపాధి పొందేలా కృషిచేయాలని, మార్కెటింగ్‌కు వెబ్‌సైట్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ వారికి సూచించారు.

చంద్రకాంత్ శర్మ మృతి తీరనిలోటు

చంద్రకాంత్‌శర్మ (ఫైల్)

వర్గల్, ఆగస్టు 2: నాచగిరి క్షేత్రంలో సుదీర్ఘకాలం పాటు పనిచేసిన కృష్ణ యజుర్వేద పండిత గురువు జోషిచంద్రకాంత్ శర్మ అకాల మరణం పండిత లోకానికి తీరని లోటని ఆలయ వేద పండితులు పేర్కొన్నారు. ఎందరో యజుర్వేద వేద పండితులను, స్మార్త వేద పండితులను తయారుచేసిన ఆయన మరణం దిగ్భ్రాంతిని గురిచేసిందన్నారు. నాచగిరి లక్ష్మీనృసింహ స్వామి మేలుకొల్పుతో ఆరంభమైన ఆయన వేదపారాయణం 2018 వరకు అప్రతిహతంగా కొనసాగిందన్నారు. చంద్రకాంత్‌శర్మ మృతికి శుక్రవారం ఈవో అన్నపూర్ణ, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌గౌడ్, అర్చకులు, ఆలయ సిబ్బంది దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.

11 పంచాయతీలు విలీనం

- అమీన్‌పూర్ మున్సిపాలిటీలోకి ఆరు పంచాయతీలు
- పటాన్‌చెరులోని ఐదు పంచాయతీలు తెల్లాపూర్ మున్సిపల్‌లోకి
- పంచాయతీలను డీనోటీపై చేస్తూ త్వరలో ఉత్తర్వులు
- పంచాయతీల విలీనంపై సర్వత్రా అసంతృప్తి

సంగారెడ్డి, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) విస్తరణకు వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా మొదట ఔటర్ రింగ్‌రోడ్డు సమీప పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తోంది. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల్లోని 11 పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కానున్నాయి. విలీన పంచాయతీలను డీనోటీపై చేస్తూ త్వరలో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. అధికారుల సమాచారం మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీని ఔటర్ వరకు విస్తరించాలని నిర్ణయం తీసుకుని మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. జీహెచ్ఎంసీ విస్తరణ కోసం మొదటగా ఔటర్ సమీపంలోని గ్రామాల విలీన ప్రక్రియను ప్రారంభించింది. సంగారెడ్డి జిల్లాలో ఔటర్ సమీపంలోని 11 పంచాయతీలను సమీపంలోని రెండు మున్సిపాలిటీల్లో విలీనం చేస్తున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం ఔటర్‌రింగ్ రోడ్డు లోపల ఉన్న మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలిపి కొత్త డివిజన్లను ఏర్పాటు చేయనున్నది.

రెండు మున్సిపాలిటీల్లో 11 పంచాయతీలు విలీనం

ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోని 11 పంచాయతీలు రెండు మున్సిపాలిటీల్లో విలీనం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా యంత్రాంగం ఇది వరకే ప్రభుత్వానికి పంపింది. ప్రతిపాదిత విలీన పంచాయతీలకు సంబంధించిన జనాభా, ఓటర్లు, విస్తీర్ణం, పరిశ్రమలు తదితర వివరాలను అధికారులు ప్రభుత్వానికి పంపారు. పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఇటీవల ముగిసింది. దీంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీల విలీనానికి ఇదే సరైన సమయం అని భావించిన ప్రభుత్వం భావిస్తున్నది. పంచాయతీల పాలకవర్గాలు ఉంటే విలీనం అయ్యే మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ ఎన్నికలు పూర్తయ్యేందుకు కనీసం 3 నెలల సమయం పడుతుంది. ఈ లోపు ఎన్నికలు వస్తే ఆ ప్రక్రియ పూర్తయ్యేందుకు మరింత సమయం పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనలో విలీన ప్రక్రియకు తెరతీసింది. పటాన్‌చెరు మండలంలోని పోచారం, ముత్తంగి, కర్థనూరు, పాటి, ఘనపూర్ పంచాయతీలు తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం కానున్నాయి. అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్‌గూడ, దాయర, సుల్తాన్‌పూర్ పంచాయతీలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం చేయనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలను విలీనం చేయడంతో పన్నుల భారం పెరగడం, అనుమతులు పొందడం అంత సులభంగా ఉండదని, ప్రజాసేవలు సక్రమంగా అందవని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తున్నారు. పంచాయతీలను రద్దు చేయడంతో ప్రజలపై పన్నుల భారం పెరుగుతుందంటున్నారు. అభివృద్ధి కుంటుపడి ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు స్థానిక నాయకులు రాజకీయంగా పదవులు కోల్పోవాల్సి వస్తుందని చెబుతున్నారు.

జీహెచ్ఎంసీ విస్తరణతో మరిన్ని కొత్త డివిజన్లు?

ప్రభుత్వం ఔటర్ వరకు జీహెచ్ఎంసీ విస్తరించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలో జీహెచ్ఎంసీ డివిజన్ల సంఖ్య మరిన్ని పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో పటాన్‌చెరు, భారతినగర్, ఆర్‌సీపురం డివిజన్లు ఉన్నాయి. కాగా, ప్రభుత్వం తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసే అవకాశం ఉంది. ఇదే జరిగితే కొత్తగా రెండు నుంచి మూడు డివిజన్లు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రతిపాదిత విలీన పంచాయతీలు

మండలంపేరు	పంచాయతీలు	విలీనం అయ్యే మున్సిపాలిటీ
పటాన్‌చెరు	పోచారం, ముత్తంగి, కర్థనూరు, పాటి, ఘనపూర్	తెల్లాపూర్
అమీన్‌పూర్	ఐలాపూర్, ఐలాపూర్‌తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ దాయార, సుల్తాన్‌పూర్	అమీన్‌పూర్